

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు



## వారాల ఆనంద్

ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand**@hotmail**.com**

## అను

**భాష:** బెంగాలి; **కథ, దర్శకత్వం** - సరరూప సన్యాల్, **నటీనటులు:** ఇంద్రాణి హోల్దార్, నిర్మలా బెనర్జీ

**విడుదల:** 1998




**పురుషాధిపత్య భావజాలాన్ని మనుషుల్లోంచి ఆచరణలోంచి వదిలించుకోవడం** అంత సులువుకాదు. డిక్లాసిఫై కావడానికి ఎంత నిజాయితీ ఎంత నిబద్దత ఉండాలో అంతకంటే అధికంగా ఆలోచనా అవగాహన ఉంటే తప్ప ‘డిపాట్రియార్కిసమ్‘ సాధ్యం కాదు. ఎందుకంటే అణువణువునా స్త్రీ పురుష తేడాలూ, ఆధిపత్యాలు మనలో జీర్ణించుకుని ఉన్నాయి. ఏదో ఒక క్షణంలోనో, సంఘటనలోనో పురుషాధిక్యత వ్యక్తమవుతూ ఉండడాన్ని మనం గమనించవచ్చు.

కులాలు, కలిమిలేములు, స్త్రీ పురుష లింగ బేధాలు అన్న తేడా లేకుండా ఎదుట ఉన్న మనిషిని స్త్రీగానో పురుషుడుగానో కాకుండా మనిషిగానే చూసి సహచరుడి స్థాయిని పొందడం ఓ మహత్తరమైన విషయం. ఎంతో స్థితనిబద్ధత ఉంటే తప్ప సాధ్యం కాదు.

ఇంకా మన సమాజంలో పురుష ఆధిపత్యంతో పాటు స్త్రీని ఆస్తిగా చూడ్డం, ఆమె శీలం అత్యంత పవిత్రమయిందని, ఆమె ప్రమేయం లేకుండానే ఆమె శీలంపై దాడి జరిగితే ఆమె సర్వం కోల్పోయిందన్న భావజాలం కూడా రాజ్యమేలుతూ ఉంది. ఈ ఆలోచనా సరళి సాధారణ జనంతో పాటు మేధావులమనుకునేవారిలో కూడా వేళ్ళూనుకుని ఉండడం అత్యంత విషాదం చివరికి ఉద్యమాల్లో పనిచేసే కొందరిలో కూడా ఈ స్థితి కనిపించడం మనకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అందుకే ఉద్యమ దారిలో అతని మెటమార్ఫోసిస్ సరిగ్గా జరగలేదన్నది మనం అర్థం చేసుకోవాల్సిన అంశం.



ఇంద్రాణి హాల్దార్

సరిగ్గా ఇలాంటి ఒక వ్యక్తి ప్రవర్తనను స్త్రీ కోణంలోంచి వీక్షించి బెంగాలీలో ఓ చిత్రం నిర్మించారు సతరూప సన్యాల్. ఆమెకిది మొదటి చిత్రమే అయినప్పటికీ రచయిత్రిగా, కవిగా, నటిగా, పెయింటర్‌గా ఆమెకున్న భావనాత్మకమయిన అనుభవంలోంచి నిర్మితమయిన 'అను' సినిమా విశేష ప్రశంసల్ని అందుకుంది. ప్రముఖ బెంగాలీ దర్శకుడు ఉత్పలేందు చక్రవర్తి వద్ద సహాయ దర్శకురాలిగా పనిచేసిన సతరూప సన్యాల్ నిర్మించిన 'అను' పురుష భావజాలాన్ని ఆవిష్కరించడంలో విజయం సాధించింది. కొంత మెలోడ్రమటిక్‌గా చిత్రం నడిచినప్పటికీ సబ్జెక్టును డీల్ చేయడంలో దర్శకురాలి ప్రతిభ ఎన్నో మన్ననల్ని పొందింది.

కలకత్తా నగరానికి దూరంగా ఉన్న ఓ పట్టణంలో స్కూలు టీచరుగా పనిచేస్తున్న అను, రాజకీయ ఖైదీగా జైలు జీవితం అనుభవిస్తున్న సుగతో విడుదల కోసం వేచి చూస్తూ ఉంటుంది. ఎనిమిది సంవత్సరాల ఎదురుచూపుల తర్వాత సుగతో విడుదలవుతున్న సమాచారం అందుకుని అను కలకత్తా చేరుకుని భరత్‌ను కలుస్తుంది. రాజకీయ ఆక్టివిస్ట్ అయిన భరత్ అనుకి సుగతో లేని ఎనిమిదేళ్ళ కాలంలో ఎంతో ఆత్మధైర్యాన్నిచ్చిన మిత్రుడు. జైలు నుంచి విడుదలైన సుగతో అనుని, భరత్‌ను చూసి మహదానందం పొందుతాడు. టాక్సీలో ఇంటికి తిరిగి వస్తూ ఉండగా తన నుదుటన సింధూరం పెట్టమని కోరుతుంది అను. అలా ఆమె సుగతోను తన భర్తగా స్వీకరిస్తుంది. ఇల్లు చేరిన రాత్రి అనుదరి చేరిన సుగతో ఆమె రొమ్ముపై ఉన్న గాయపు మరకను చూసి ఏమయిందని అడుగుతాడు.

ఎనిమిది ఏళ్ళ క్రితం సుగతో అరెస్టు అయిన రోజున బరసాత్ లోని మార్చురీలో అను తమ్ముడి శవం పడి ఉందని తెలీడంతో తల్లి తండ్రి వెళతారు. అది గమనించిన ఓ అల్లరిమూక అను ఇంట్లోకి బొరబడి ఆమెను గ్యాంగ్ రేప్‌కు గురిచేస్తారు. సుగతోతో అనూకున్న సహచర్యం తెలిసి ప్రతీకారం చేసేందుకు అలా చేసామని చెప్పి వెళ్ళిపోతారు. తీవ్రమయిన హింసకు గురైన అను క్రమంగా కోలుకుని ఆ ప్రాంతానికి దూరంగా ఉన్న పట్టణంలో టీచర్ ఉద్యోగం చేసుకుంటూ ఉన్నానని వివరిస్తుంది. అదంతా విన్న సుగతో ఒక్కసారిగా వివశుడవుతాడు. తెలీని నిర్లిప్తతతో మౌనంగా ఉండిపోతాడు.

ఇదిలా ఉండగా అను శిష్యురాలు శ్రేయసి అనే యువతి స్కూలుకు రావడం మానేస్తుంది. విషయం తెలుసుకోవడానికి అను తన కొలీగ్ సురూపను వెంట తీసుకుని శ్రేయసి ఇంటికి వెళుతుంది. శ్రేయసి తను ప్రేమించిన యువకుడివల్ల గర్భవతి కావడంతో విషయం తెలుసుకున్న ఆమె తల్లి శ్రేయసిని గదిలో పెట్టి తాళం వేస్తుంది. అను, సరూపలు ఆ కుర్రాడిని వెదికి పట్టుకుంటారు. కానీ శ్రేయసిని పెళ్ళాడడానికి అతడు అంగీకరించడు. ఇంతలో శ్రేయసికి అబార్షన్ జరిపించే క్రమంలో ఆమె చనిపోతుంది.

ఇదంతా చూసి మానసికంగా కదిలిపోయిన అను సుగతోలో వచ్చిన మార్పుని గమనిస్తుంది. ఉదాసీనంగా మారిన సుగతో మానసిక స్థితిని పరీక్షించడానికి అతన్ని మానసిక వైద్యుని వద్దకు తీసుకెళుతుంది. ఆ రోజు పరీక్షించిన తర్వాత మరో విజిట్ కోసం తెల్లారి రమ్మంటాడు డాక్టర్.

మర్నాడు స్కూలు సమయానికి ముందే ఇల్లు చేరుకున్న అను టేబుల్ పైన సగం తెరిచి ఉన్న డైరీని చూస్తుంది. ఆసక్తిని ఆపుకోలేక తెరిచి చదువుతుంది. గ్యాంగ్ రేప్ తర్వాత అను తన కన్యత్వాన్ని కోల్పోయిందని ఆమె పట్ల తన అయిష్టతను రాసుకుంటాడు డైరీలో సుగతో. అది చదివిన అనుకి సుగతో తన పట్ల ఎందుకు నిరాసక్తంగా ఉంటున్నాడో అర్థమయి తీవ్ర వ్యధకి గురవుతుంది. ఉద్యమశీలతతో పరిపూర్ణ వ్యక్తిత్వంతో ఉన్న ఎనిమిదేళ్ళ క్రితపు సుగతోని ప్రేమించిన అను ఇవాల్టి సుగతోను భరించలేక పోతుంది. భరత్‌ని వెంట తీసుకుని ఇంటికి వచ్చిన సుగతోని తన ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటుంది అను. ఆయనతో ఎలాంటి సంబంధమూ లేదని చెప్పేస్తుంది. కానీ ఎనిమిదేళ్ళుగా సుగతో కోసం అను ఎంతగా ఎదురుచూసింది భరత్ గుర్తుచేస్తాడు. కానీ ఆమె ఇంకేమీ వినడానికి ఇష్టపడదు. తన కన్యత్వంపైనా, శీలపైనా పట్టింపులున్న సుగతో అంటే అసహ్యాన్ని పెంచుకుంటుంది. తనవాడయినా సుగతో కోసం వెయ్యేళ్ళయినా వేచిచూస్తాను కాని ఈ సుగతోను భరించలేనని ఖచ్చితంగా చెప్పేస్తుంది. ఎంతగా ఉన్నతుడూ, ఉద్యమశీలి అయినప్పటికీ తన పురుష భావజాలాన్ని వదిలించుకోలేని సుగతోని అను నిరాకరిస్తుంది. తన జీవితం నుంచి వెళ్ళగొడుతుంది. మనిషి మనస్తత్వానికి సంబంధించిన విశ్లేషణను, సామాజికంగా పురుషుడి ఆధిపత్య భావజాలాన్ని ఎండగడుతూ నిర్మించిన 'అను' మంచి చిత్రంగా నిలిచిపోయింది.

●●●

## కామలాకీ మౌత్

**భాష** – హిందీ; **సంగీతం** – సలీల్ చౌదరి; **కెమెరా** – అజయ్ ప్రభాకర్; **నిర్మాణం** – ఎన్‌ఎఫ్ డిసి; దర్శకత్వం బాసు ఛటర్జీ. **విడుదల:** 1989




**మధ్యతరగతి ప్రజల్లో** పైకి కనిపించే గాంభీర్యం గట్టిగా చిటికేస్తే చాలు కూలిపోయే స్థితిలో ఉంటుంది. పైకి అంతా సజావుగానూ, ఆనందంగానూ కనిపించే వారి మానసిక స్థితి అతలాకుతలం కావడానికి గొప్ప కారణాలేమీ అవసరం లేదు. తెచ్చిపెట్టుకున్న నవ్వులు, అల్లుకుని ఆచ్ఛాదనంగా వేసుకున్న భద్రత మధ్య తరగతి జీవుల ఉపరితల లక్షణమే. లోపలంతా బోలుతనంతో కూడుకున్న వారి జీవితాల్లోకి ఓ యువతి ఆత్మహత్య సంఘటన పెను ఉప్పెనలా తోసుకొస్తుంది. ఆ యువతి పక్కింటి అమ్మాయే అయినప్పుడు ఆ సంఘటన మన ముందు వాకిట్లోనే జరిగినప్పుడు మధ్య తరగతి జీవులు తట్టుకుని నిలబడడం కష్టం. అలాంటి సంఘటన ఎదురయినప్పుడు ఓ మధ్య తరగతి కుటుంబంలోని సభ్యుల్లో కనిపించే ప్రతిస్పందనల్ని ఆధారం చేసుకుని బాసు ఛటర్జీ నిర్మించిన చిత్రమే 'కామలాకీ మౌత్'

మనిషి ఆత్మహత్యకు మానసిక, సామాజిక కారణాలే ప్రధాన హేతువులయినప్పటికీ మహిళకు, యువతుల్లో జరిగే ఆత్మహత్యలకి మన సమాజంలో ప్రత్యేక కారణాలు ఉన్నాయి. యువతుల్లో ప్రేమ విఫలం, ప్రియుడి మోసం, స్త్రీలలోనయితే భర్త లేదా కుటుంబ సభ్యుల నిరాదరణ ప్రధానమయిన కారణాలుగా మనకు కనిపిస్తాయి. ఇవాళ్ళ నగర ఉన్నత తరగతికి చెందిన యువతుల ప్రేమ వైఫల్యాలు, మోసాలు కారణంగా ఆత్మహత్యలు అనేకం జరగడం మనం చూస్తూనే ఉన్నాం. మధ్య

తరగతిలో పరిస్థితులేమీ భిన్నంగా లేవు. పురుషాధిక్తత తక్కువ ఏమీలేదు మిడిల్ క్లాస్ వాతావరణంలో బంధాలకీ, బంధనాలకీ, నీతి సూత్రాల కట్టుబాట్లకీ ఇంకా పట్టింపులున్నాయి. అలాంటి స్థితిలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన కమల తనను ప్రియుడు మోసం చేశాడని, అప్పటికే తను గర్భవతినని తెలుసుకుని చాల్ (కొన్ని ఫ్లాట్లున్న పెద్ద భవంతి) పై అంతస్తు నుండి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ సంఘటన ప్రభావం ఆ చాల్‌లో నివసిస్తున్న ఓ మధ్యతరగతి కుటుంబ సభ్యులపైన ఎంతలా ప్రభావం చూపిస్తుందన్న విశ్లేషనే 'కామలాకీ మౌత్' చిత్రం.

1970 ప్రాంతంలో స్వదేశ్ బండోపాధ్యాయ రాసిన చిన్న కథ ఆధారంగా బాసు చటర్జీ నిర్మించారీ చిత్రాన్ని. బాసు ఛటర్జీ అనగానే రజనీ గంధ, చోటీసీ బాత్, చిత్ చోర్, సారా ఆకాశ్, పియాకా ఘర్, స్వాం, షాకీన్ లాంటి హాయి గొలిపే చిత్రాలు గుర్తొస్తాయి. సున్నితమయిన ప్రేమ కథలు, కుటుంబ గాధలు ఇతివృత్తాలుగా చేసుకుని ఆయన నిర్మించిన చిత్రాలన్నీ సామాన్య ప్రజానీకం జీవన వాస్తవాలే వాటిని ఆయన తనదైన ధోరణిలో తేలికైన విధానంలో చిత్రీకరించారు. సొంత గొంతునీ, ఒరవడినీ అలవర్చుకున్న బాసు ఛటర్జీ నిర్మించిన 'కామలాకీమౌత్'లో ఒక స్థాయిలో కమల ఆత్మహత్య అందుకు కారణాలు, సామాజిక విలువలు తదితర మయిన అంశాల్ని చర్చిస్తారు. మరో స్థాయిలో మధ్య తరగతి కుటుంబ సభ్యుల్లోని ద్వంద్వ విలువలు, బయటికొకటీ, లోన ఒకటిగా ఉండేవారి మనస్తత్వాల్ని వివరిస్తాడు. చిత్రీకరణలో గానీ సాంకేతిక పరమయిన విషయాల్లో గానీ అమితమయిన పరిమితులతో నిర్మితమయిన ఈ సినిమా చర్చించిన అంశం అభినందనీయమయిందే వర్తమానాలూ, ఫ్లాష్ బ్యాక్‌లూ కలగలిపి కొనసాగిన ఈ చిత్రం బాసూదా బాణీని కొనసాగించింది.

'కమలాకీ మౌత్' చిత్రం కమల ఆత్మహత్యతో ప్రారంభమవుతుంది. గర్భవతి అయిన ఆ యువతి తన ప్రియుడు మోసం చేయడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతుంది. ఆమె బంగళాపైనుండి దూకి చనిపోవడంతో ఆ చాల్‌లో నివసిస్తున్న వారంతా తీవ్రమయిన భయాందోళనకు గురౌతారు. అలాంటి ఓ మధ్య తరగతి కుటుంబం సుధాకర్‌ది. ఆయన కుటుంబంలో ఆయనతోపాటు ఆయన భార్య నిర్మల, ఇద్దరు కూతుళ్ళు గీత, చారులు ఉంటారు. సాయంత్రం టీ తాగుతూ ఆ కుటుంబ సభ్యులంతా కమల ఆత్మహత్య గురించే చర్చించుకుంటారు. 'ఆత్మహత్య చేసుకోవడానికి ఇంకా అనేక పద్ధతులుండగా బంగళామీంచి దూకి చావడమెందుకో?' అని నిర్మల అంటుంది. అంతేకాదు. కమల గర్భవతి అని తెలియడంతో అనేక చర్చలూ, ఊహలూ కొనసాగుతాయి. అంతా మామూలుగానే రాత్రి నిద్రకు ఉపక్రమిస్తారు. కానీ ప్రతి ఒక్కరిలోనూ మొదలవుతుంది కమల ఆత్మహత్య ప్రభావం ఎవరికి వాళ్ళు వారి చేదు అనుభవాల్లోకి జ్ఞాపకాల్లోకి, భయాల్లోకి తొంగి చూడ్డం ఆరంభిస్తారు.

గీత అప్పటికే ఇంట్లో వాళ్ళకి తెలీకుండా తన క్లాస్ మేట్ అజిత్‌తో స్నేహం చేస్తూ ఉంటుంది. ఒకటి రెండు సార్లు ఆయన గదికి వెళుతుంది. కమల ఆత్మహత్య గీతలో తీవ్ర భయాన్ని కలిగిస్తుంది. తనకేమయినా అయితే అనుకుంటుంది. అజిత్‌తో ఇక ఖచ్చితంగా మాట్లాడాలి అనుకుంటుంది. చారు తన బాయ్ ఫ్రెండ్ దీపక్‌తో తన అనుబంధం కమలలాగే చెడుగా ముగిసినట్టు పీడకల కంటుంది.

నిర్మలకు తన గతం గుర్తొస్తుంది. తన చిన్ననాడు సినిమా పత్రికలు, ప్రేమ కథలు చదివిన ప్రేరణతో తను తన టీచర్‌నే ప్రేమించిన వైనం జ్ఞాపకం వస్తుంది. టీచర్ నుంచి బదులు రాకపోవడంతో తను చెరువులోకి దూకిన దుస్సంఘటనా గుర్తొస్తుంది. కానీ ఇదంతా తన భర్తకు ఏనాడూ చెప్పలేదన్న సంగతి స్ఫురణకు వస్తుంది. తనలాగే తన కూతుళ్ళు కూడా అమాయకంగా ఎదగాలని ఆమె ఆశిస్తుంది.

ఇక అమాయకంగా కనిపించే సుధాకర్‌లో కమల మరణం పెద్ద తుఫానునే రేకెత్తిస్తుంది. ఆయనకు గతంలో జరిగిన అనేక సంఘటనలు క్రమంగా గుర్తొస్తాయి. యవ్వనం తొలిరోజుల్లో గర్ల్‌ఫ్రెండ్‌తో తిరగడం, ఆమెకు గర్భం రావడంతో అబార్షన్ చేయించి అక్కడి

నుండి పారిపోయిన సంగతి గుర్తొస్తుంది. పెళ్ళి ప్రస్తావన నుంచి పారిపోయి ట్రైబల్ ప్రాంతాన్ని చేరిన సుధాకర్ అక్కడా ఓ ట్రైబల్ యువతితో ప్రేమ నడిపించి పెళ్ళి ప్రస్తావన రావడంతో అక్కడినుంచీ పారిపోతాడు. తర్వాత ఓ మిత్రుడి భార్యతో సంబంధమేర్పడడం, ఆ తర్వాత ధనవంతుడి కూతురయిన నిర్మలను పెళ్ళాడ్డం అన్నీ స్ఫురణకు వస్తాయి. ఒకటి తర్వాత ఒకటిగా గతమంతా రీలులా ముందు తిరిగినప్పటికీ సుధాకర్ తన గతాన్ని గురించి చింతించడు. తన కూతుళ్ళ భవిస్యత్తు గురించే అతనిలో వ్యధ మొదలవుతుంది.

ఇలా సినిమా పలు అసంపూర్తిధారలతో కొనసాగుతుంది. అయితే ఫక్తు మధ్య తరగతి జీవిత విధానాన్ని ఆవిష్కరిస్తూ తెల్లారేసరికి అంతా అన్ని మరిచిపోయి తమ దినచర్య ఆరంభిస్తారు. 'కమల చనిపోకుండా ఉంటే బాగుండేది. ఆమె జీవితం ఎప్పట్లాగే సాఫీగా గడిచిపోయేది' అని సుధాకర్ పెద్ద నిట్టూర్పుతో అంటాడు.

కానీ నిర్మల మాత్రం "కొన్ని విషయాలు ఎప్పటికీ రహస్యంగా ఉంచితేనే మంచిది. అందరూ అట్లాగే ఉంటే ఏ గొడవా ఉండదు" అనడంతో చిత్రం ముగుస్తుంది.

ఈ చిత్రం సాఫీగా, హాయిగా గడిచిపోయినట్లనిపించినప్పటికీ ఆత్మహత్య దాని పర్యవసానాలు, మధ్య తరగతి జీవుల మానసిక విశ్లేషణను అత్యంత ప్రతిభావంతంగా మనముందుంచుతుంది. కమల మరణం. దానికి కారణాలు, దాని పర్యవసానాల్ని మధ్య తరగతి జీవుల కోణంలోంచి దర్శించిన చిత్రం 'కామలాకీ మౌత్'.

●●●

**Click here to share your comments on this article.**